క్లుప్తంగా

సింగరేణి పాఠశాలకు ప్రముఖుల చిత్రపటాలు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మహనీయుల, స్వాతంత్ర సమరయోధులు, శాస్త్రవేత్తలు, క్రీడాకారులు, కళాకారులు, సంగీతం, సినీనటుల పరిచయ నిమిత్తం వారి చిత్రపటాలను సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ గుండా శ్రీనివాస్ మంగళవారం అందజేశారు. అనంతరం వాటిని పాఠశాలలోని గోడలకు అందరి దృష్టి పడేలా ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహనీయులు దేశానికి, సమాజానికి వారు చేసిన సేవల గురించి వివరించారు. దీనివలన విషయ పరిజ్ఞానంతోపాటు వారి గురించి అవగాహన పెరుగుతుందన్నారు. మండల విద్యాశాఖాధికారి డాక్టర్ ప్రభుదయాళ్, సైన్స్ అధికారి చలపతిరావు పాల్గొన్నారు.

ఘనంగా పెన్షనర్స్ డే

కొత్తగూడెంఅర్బన్: నెహ్రూబస్తీలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో మంగళవారం పెన్షనర్స్ డే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి హాజరయ్యారు. మాట్లాడుతూ... విశ్రాంత ఉద్యోగుల సేవలను ప్రభుత్వం వినియోగించుకోవచ్చని తెలిపారు. అనంతరం పెన్షనర్స్‌ను సన్మానించారు. సంఘం అధ్యక్షులు వెస్లీ, ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకటేశ్వరరావు, మండలాల సభ్యులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంకు వినతి


భట్టి నివాసం వద్ద గౌడ సంఘం నాయకులు

ఇల్లెందురూరల్: ఏజెన్సీ ప్రాంతాలలో గౌడ కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరిస్తూ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు సంఘం ప్రతినిధులు మంగళవారం హైదరాబాద్‌లో వినతిపత్రం అందజేశారు. కల్లు గీత వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న గౌడ కులస్తులకు ఏజెన్సీలో రాజ్యాంగపరమైన హక్కులు వర్తించేలా కృషి చేయాలని కోరారు. ప్రధానంగా కల్లు గీసే వృత్తి నుంచి ఏజెన్సీ ప్రాంతాలలో గౌడ కులస్తులను దూరం చేయడం అన్యాయమని, సుదీర్ఘకాలంగా ఇక్కడే స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్న గౌడ కులస్తులు ఏజెన్సీలో ఎదుర్కొంటున్న సమస్యలను వివరించామని గౌడ సంఘం ఇల్లెందు ప్రాంత ప్రతినిధి నరాటి వెంకటేశ్వర్లు తెలిపారు.

పాఠశాలలో ఆకస్మిక తనిఖీ

జూలూరుపాడు: అనంతారం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను జూలూరుపాడు తహసీల్దార్ కె.స్వాతిబిందు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. మెనూ ప్రకారం కూర, సాంబారు తయారీ చేయాల్సి ఉండగా కేవల కూర మాత్రమే వండటంపై ఆరా తీశారు. తప్పనిసరిగా మెనూ పాటించాలని సూచించారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, అదేవిధంగా బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఆర్ఐ ఎం.తిరుపతిరావు, హెచ్‌ఎం అంజయ్య, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్ఓఎఫ్ఆర్ భూముల పరిశీలన

జూలూరుపాడు: సోలార్ యూనిట్లను నెలకొల్పేందుకు సురారం, ఏన్కూరు మండలం మున్యాతండా గ్రామ సమీపంలోని ఆర్ఓఎఫ్ఆర్ భూములను అటవీ, వ్యవసాయ, ఎలక్ట్రికల్, రెవెన్యూ శాఖల అధికారులు మంగళవారం పరిశీలించారు. అధికారులు మాట్లాడుతూ.. భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్ ఆదేశాల మేరకు వ్యవసాయ భూములను చూసినట్లు చెప్పారు. రైతులు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఎఫ్ఆర్ఓ జి.ప్రసాద్‌రావు, ఏఓ దీపక్ ఆనంద్, విద్యుత్‌శాఖ ఏఈ సతీష్, ఆర్ఐ తిరుపతిరావు, సెక్రటరీ హరిబాబు, ఎఫ్ఎస్ఓ హనుమంతు, బీట్ ఆఫీసర్ నరసింహారావు, రైతులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్లకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

ఇలెందు: ప్రభుత్వం అర్హత కలిగిన ట్రాన్స్‌జెండర్లకు హోం గార్డు ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించిందని, అర్హత తక్కువ ఉన్న వారికి కూడా ఉద్యోగ అవకాశాల్లో చోటు కల్పించాలని, అందరికీ పింఛన్ మంజూరు చేయాలని శివసత్తుల రాష్ట్ర అధ్యక్షులు దండు సారిక(సారయ్య) కోరారు. మంగళవారం ఇల్లెందులోని కొత్త కాలనీలో విలేకరులతో మాట్లాడుతూ.. ఇటీవల ప్రభుత్వం ట్రాన్స్‌జెండర్లకు హోంగార్డు ఉద్యోగాలు ప్రకటించిడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో అందరికీ అవకాశం కల్పించాలని కోరారు. ఇల్లెందులో 16 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారని, కొత్తగూడెం నుంచి కొంతమంది ఇల్లెందు వచ్చి పండుగలు, పెళ్లిళ్ల వద్ద మామూళ్లు అడుక్కొని వెళ్తుతున్నారని ఇల్లెందు వారికి అన్యాయం జరుగుతోందన్నారు. పోలీసులు జోక్యం చేసుకుని ఎక్కడి ప్రాంతం వారు అక్కడే ఉండేలా చూడాలని కోరారు. ఈ సమావేశంలో స్వరూప, అఖిల, హన్సిక, సహస్రా, వర్షిణీ, శృతి, రాధిక, మునేశ్వరీ, హనీ, నాగదేవి ఉన్నారు.

గిరిజనుల కల సాకారం..

- ఎట్టకేలకు కిన్నెరసాని బ్రిడ్జి నిర్మాణం పూర్తి
- అప్రోచ్‌రోడ్డుకు రివిట్‌మెంట్ పూర్తి చేయాలని వినతులు


యానంబైల్, రాజాపురం గ్రామాల మధ్య కిన్నెరసాని వాగుపై నూతన బ్రిడ్జి

పాల్వంచరూరల్: రెండున్నర సంవత్సరాల తర్వాత ఎట్టకేలకు కిన్నెరసాని వాగుపై బ్రిడ్జిపై నిర్మాణం పూర్తయింది. దీంతో ఎన్నో సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న ఏజెన్సీలోని 24 గిరిజన గ్రామాల ప్రజల కల సాకరమైంది. కానీ బ్రిడ్జి పనులను పూర్తి చేసిన అధికారులు అప్రోచ్ రోడ్డు మట్టి కిందకు జారిపోకుండా రివిట్‌మెంట్ పనులు చేయకుండా నిర్లక్ష్యంగా వదిలేశారు. మండలంలోని రాజాపురం, యానంబైల్ గ్రామాల మధ్య కిన్నెరసాని వాగుపై 2021లో రూ.9.70లక్షల వ్యయంతో బ్రిడ్జి మంజూరు కాగా నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ రెండున్నర సంవత్సరాల తర్వాత ఎట్టకేలకు పూర్తిచేశారు. ఇంకా బ్రిడ్జి పైన లోపల రంగులు వేయడంతోపాటు అప్రోచ్‌రోడ్డు నిర్మాణ పనులు పూర్తిచేయాల్సి ఉంది. ఈ పనులు కూడా వారం పదిరోజుల్లో పూర్తి చేసి ప్రారంభించే విధంగా పనులు చేస్తున్నారు. అయితే బ్రిడ్జి అప్రోచ్ రోడ్డు నిర్మాణం కోసం మట్టి దిగువ భాగంలో ఒకవైపు బండరాళ్లలో రివిట్‌మెంట్‌ను కట్టారు. మరోవైపు కట్టకుండా వదిలేశారు. కిన్నెరసాని వాగుకు వరద వస్తే అప్రోచ్‌రోడ్డు కోసం పోసిన మట్టి కొట్టుకపోయి రోడ్డు తెగిపోయే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా అధికారులు అప్రోచ్‌రోడ్డు కోసం పోసిన మట్టి కిందకు జారిపోకుండా వరదకు కొట్టుకపోకుండా ఉండే విధంగా రివిట్‌మెంట్ నిర్మాణం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

అప్రోచ్‌రోడ్డుకు మలుపులు..

బ్రిడ్జి దగ్గర నుంచి యానంబైల్ వైపు166 మీటర్లు, రాజాపురం వైపు 262 మీటర్ల అప్రోచ్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. అయితే ఈరోడ్డు పలు మలుపులతో నిర్మాణం చేయడం వలన వాహనదారులకు ప్రమాదం పొంచి ఉందని స్థానికులు అంటున్నారు.


బ్రిడ్జి అప్రోచ్ రోడ్డు

సంతోషంగా ఉంది...


కిన్నెరసాని వాగు వద్ద బ్రిడ్జి లేక వర్షాకాలంలో ప్రాజెక్టు గేట్లు ఎత్తితే మాగ్రామంతోపాటు అనేక గిరిజన గ్రామాల ప్రజలు మండల కేంద్రమైన పాల్వంచకు, విద్యార్థుల రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. నిరీక్షిస్తున్న ప్రజలకు బ్రిడ్జి పనులు పూర్తికావడంతో సంతోషంగా ఉంది.

– బుడగం రాంమోహన్‌రావు, యానంబైల్

ఇబ్బందులు తొలగినట్లే..


కిన్నెరసాని వాగుపై బ్రిడ్జి లేక వర్షాకాలంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. గేట్లు ఎత్తినప్పుడు రవాణా స్తంభించడంతో ఎగువన ఉన్న గిరిజన గ్రామాల ప్రజలు పది కిలోమీటర్లు చుట్టు తిరిగి అష్టకష్టాలు పడుతున్నాం. బ్రిడ్జి నిర్మించడంతో ఇబ్బందులు తొలగినట్లే.

– రాంబాబు, ఉల్వనూరు

త్వరలో పూర్తి చేస్తాం..


కిన్నెరసాని వాగుపై బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తికావచ్చాయి. రంగులు, అప్రోచ్‌రోడ్డుకు తారు నిర్మాణం చేయాల్సి ఉంది. పెండింగ్ పనులను కూడా త్వరలోనే పూర్తి చేసి ప్రారంభిస్తాం. అప్రోచ్ రోడ్డు కింద రివిట్‌మెంట్‌కు అగ్రిమెంట్‌లో లేదు. ప్రతిపాదనలు పంపించాము.

– వంశీ, ఆర్అండ్‌బీ ఏఈ

సమస్యల పరిష్కారానికి పోరాటం..

జూలూరుపాడు: కార్మికుల హక్కులు, సమస్యలపై నిరంతరాయంగా పోరాటం కొనసాగిస్తామని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల జమలయ్య అన్నారు. మంగళవారం ఏఐటీయూసీ బృందం జూలూరుపాడు ఉప మార్కెట్ యార్డును సందర్శించి, రైతులు, హమాలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మాట్లాడుతూ.. జూలూరుపాడు ఉప మార్కెట్ యార్డుకు పెద్దమొత్తంలో ఆదాయం వస్తున్నప్పటికీ కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో హమాలీలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. స్థానిక ఉప మార్కెట్ యార్డును శాశ్వత మార్కెట్ చేయాలని, దీనికి జిల్లా మంత్రులు, స్థానిక ఎమ్మెల్యే కృషి చేయాలని కోరారు.


మాట్లాడుతున్న జమలయ్య

హమాలీల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గుండెపిన్ని వెంకటేశ్వర్లు, జక్కుల రాములు, ఎస్కే చాంద్‌పాషా, ఎస్కే నాగుల్‌మీరా, గార్లపాటి శివకృష్ణ, పత్తిపాటి మహేష్, హమాలీలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ బంద్

సూపర్‌బజార్(కొత్తగూడెం): విద్యుత్ లైన్ల మరమ్మత్తుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ కొత్తగూడెం ఏడీఈ హేమచంద్రబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు గంగాబి షన్ బస్తీ, ఫ్యూస్ బస్తీ, ఎ పవర్‌బస్తీ, దో నంబర్ బస్తీ, ఎస్‌సీబీ నగర్ ప్రాంతాలలో, రామవరం 11 కేవీ లైన్ ట్రీ క్లియరెన్స్ నిమిత్తం మున్సిపాలిటీ ఏరియా, ప్రశాంత్‌నగర్, 2 ఇంక్‌లైన్ గ్రామ పంచాయతీలలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

సర్వే వేగవంతం చేయాలి


సర్వేను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

టేకులపల్లి: ఇందిరమ్మ ఇళ్ల సర్వేను వేగవంతం చేయాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ వేణుగోపాల్ అధికారులు, సిబ్బందికి సూచించారు. ఈ మేరకు మంగళవారం టేకులపల్లి మండలం సులానగర్ పంచాయతీలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. యాప్‌లో వివరాల నమోదును పరిశీలించారు. ఎంపీడీఓ గడదాసు రవీంద్రరావు, తహసీల్దార్ నాగభవానీ, ఎంపీఓ జేఎల్ గాంధీ, కార్యదర్శి పవిత్ర పాల్గొన్నారు.

పీఆర్‌టీయూలో చేరిక

టేకులపల్లి: మూడు దశాబ్దాల కాలం టీపీటీఎఫ్ సంఘంలో పని చేసిన ఒడ్డుగూడెం జీపీఎస్ హెచ్‌ఎం ఎం.వెంకటరామయ్య మంగళవారం పీఆర్‌టీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు టి.రవీందర్ సమక్షంలో పీఆర్‌టీయూలో చేరి సభ్యత్వం తీసుకున్నారు. మాట్లాడుతూ.. పీఆర్‌టీయూ సంఘం కార్యకలాపాలకి నా వంతుగా కృషి చేస్తానని తెలిపారు. మోతీలాల్, రమేష్ బాబు, రమణ, పన్నాలాల్ పాల్గొన్నారు.

రగ్గుల పంపిణీ

సింగరేణి(కొత్తగూడెం): ఇంక్‌లైన్ పంచాయతీ పరిధిలోని క్రీస్తు సంఘం చర్చి ఆధ్వర్యంలో పేదవారికి దాత చెనెల్లి రమేష్ ఇచ్చిన రగ్గులను ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోషియేషన్ జనరల్ సెక్రటరీ ఆంతోటి నాగేశ్వరరావు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో గోవర్ధన్, దేవదానం, రవి బాబు, సొత్తు విజయ్, బాబూరావు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రులను బలోపేతం చేయాలి

టేకులపల్లి: ప్రభుత్వాస్పత్రులను బలోపేతం చేయాలని పీవైఎల్ రాష్ట్ర కార్యదర్శి వాంకుడోత్ అజయ్, పీఓడబ్ల్యూ తెలంగాణ మాజీ రాష్ట్ర కార్యదర్శి చంద్ర అరుణ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు మంగళవారం టేకులపల్లి మండలం సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి సౌకర్యాలు, వైద్య సేవలను పరిశీలించారు. మాట్లాడుతూ... రాష్ట్రంలోని ప్రభుత్వాస్పత్రులను బలోపేతం చేయాలని, ఖాళీపోస్టులను భర్తీ చేయాలన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపట్టామని తెలిపారు. సావిత్రి, ధరావత్ దేవా, పూనెం మంగయ్య, కోరం ముత్తక్క పాల్గొన్నారు.

ప్రణాళికతో చదువుకోవాలి


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సులోచనారాణి

టేకులపల్లి: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం విద్యార్థుల తల్లిదండ్రులతో (పేరెంట్స్ టీచర్స్ మీటింగ్) నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులు హాజరై తమ పిల్లల ప్రగతి నివేదికను అడిగి తెలుసుకున్నారు. ప్రిన్సిపాల్ సులోచన రాణి మాట్లాడుతూ.. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని రాబోయే పరీక్షలలో విజయం సాధించేందుకు విద్యార్థులకు 90 రోజుల ప్రణాళిక సిద్ధం చేశామని దాని అనుసరించి సిద్ధం కావాలని కోరారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా తమకు సహాయ సహకారాలు అందించి విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు బసవమ్మ, సత్యవతి, ముంతాజ్ అలీ, శంకర్రావు, వేణుగోపాల్, శ్రీనివాస్ రావు, వరలక్ష్మి, ప్రమోద్ కుమార్, నాగేశ్వరరావు, సిబ్బంది పుల్లారావు, రమేష్, సాంబయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

పాల్వంచ: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, 6వ బెటాలియన్ కమాండర్ శివప్రసాద్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక పాత పాల్వంచ చింతలచెరువు కట్టపై క్రాస్ కంట్రీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం కప్ 10 కె, 8 కె రన్ పోటీలను ప్రారంభించారు. మాట్లాడుతూ.. విద్యార్థులు గ్రామీణ స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడల ద్వారా ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకోవచ్చన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో డీవైఎస్ఓ పరంధామరెడ్డి, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.యుగంధర్‌రెడ్డి, సెక్రటరీ రాజేంద్రప్రసాద్, వై.వెంకటేశ్వర్లు, బీఎస్ రమేష్, మహిధర్, చీఫ్ కోచ్ పి.నాగేందర్, గిరిప్రసాద్, ఇందు, అక్బర్, వెంకట్, నాగరాజు, పీఈటీలు పాల్గొన్నారు.


బహుమతులు అందిస్తున్న కొత్వాల, తదితరులు

సమాన పనికి సమాన వేతనం ఇవ్వండి..


మద్దతు తెలుపుతున్న హరిలాల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): సమస్యల పరిష్కారానికి సమగ్ర శిక్షా ఉద్యోగులు కలెక్టరేట్ వద్ద ధర్నా చౌక్‌లో సమ్మె మంగళవారం నాటికి 8వ రోజుకు చేరుకుంది. టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గుగులోత్ హరిలాల్ నాయక్ సమ్మె శిబిరం వద్దకు వచ్చి మద్దతు తెలిపారు. బి.రమేష్, భూక్యా మోహన్, బట్టు చందు, సిద్ధు, వనమా సురేష్ పాల్గొన్నారు.

టేకులపల్లి: సమగ్ర శిక్షా ఉద్యోగులు ఎనిమిది రోజులుగా కలెక్టరేట్ వద్ద ధర్నా చౌక్‌లో చేస్తున్న సమ్మెకు తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని జిల్లా అధ్యక్షుడు గుగులోత్ హరిలాల్ నాయక్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మెకు సంఘీభావం తెలిపారు. మాట్లాడుతూ.. రోజుల తరబడి సమ్మె చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం సరైంది కాదని, చర్చలకు పిలిచి వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.

ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించొద్దు..

కొత్తగూడెంఅర్బన్: ఆటో డ్రైవర్లు ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా నిబంధనల ప్రకారం వారి ఆటోలను నడుపుకోవాలని కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్ తెలిపారు. మంగళవారం ఆటో డ్రైవర్లకు అవగాహన సమావేశం నిర్వహించి మాట్లాడారు. నిబంధనల ప్రకారం ఆటో డ్రైవర్ వివరాలు ఆటోలో కనిపించే విధంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. దీంతో పాటుగా ఆటోల వెనుక వచ్చే వాహనాలను చూసుకుంటూ ప్రమాదాలు జరుగకుండా నడపాలని చెప్పారు. రోడ్డుపై ప్రయాణికులను ఆటోలో ఎక్కించాలనే ఉద్దేశంతో ఎక్కడ పడితే అక్కడ నిలపరాదని చెప్పారు. ఈ సమావేశంలో వన్‌టౌన్ సీఐ కరుణాకర్, త్రీటౌన్ సీఐ శివప్రసాద్, ట్రాఫిక్ ఎస్సై నరేష్ పాల్గొన్నారు.

స్థానిక పోరుకు అధికారుల ఏర్పాట్లు

ఇల్లెందురూరల్: మండలంలోని 29 గ్రామపంచాయతీల పరిధిలో స్థానిక ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే ఓటరు జాబితాను సిద్ధం చేసిన అధికారులు వాటి ఆధారంగా వార్డులను విభజించి ప్రతీవార్డుకు ఓటర్లను నిర్దేశించారు. ఈ క్రమంలో ఈ నెల 7న పోలింగ్ కేంద్రాల ముసాయిదాను గ్రామపంచాయతీ, మండల పరిషత్ కార్యాలయాల్లో ప్రదర్శించారు. అభ్యంతరాలు లేకపోవడంతో మంగళవారం పోలింగ్ కేంద్రాల తుది జాబితాను ఎంపీడీఓ ధన్‌సింగ్, ఎంపీఓ చిరంజీవి ప్రకటించారు. గతానికి భిన్నంగా ఈసారి వార్డుల వారీగా ప్రత్యేక గదులలో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. దీంతో ఓటర్లు, అధికారులు, పోటీలో నిలిచిన అభ్యర్థులు, రాజకీయ పక్షాలు ఆందోళన చెందకుండా పోలింగ్ సాఫీగా సాగుతుందని అధికారులు చెపుతున్నారు. మండలంలో ఒక్కో పోలింగ్ కేంద్రంలో అత్యధికంగా 12, అత్యల్పంగా 8 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు.

పోలింగ్ స్టేషన్ల తుది జాబితా ప్రదర్శన

జూలూరుపాడు: పోలింగ్ స్టేషన్ల తుది జాబితాను గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో మంగళవారం పంచాయతీ కార్యదర్శులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ డి.కరుణాకర్‌రెడ్డి, ఎంపీఓ టి.తులసీరామ్ అనంతారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రదర్శించిన పోలింగ్ స్టేషన్ల తుది జాబితాను పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ... మండలంలో 24 గ్రామ పంచాయతీల్లో 198 వార్డులకు గాను 198 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో జీపీ సెక్రటరీ శైలజ, పంచాయతీ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.


జూలూరుపాడు: అనంతారంలో జాబితాను పరిశీలిస్తున్న ఎంపీడీఓ, ఎంపీఓ తులసీరామ్

అనంతారంలో వైద్యశిబిరం


మాట్లాడుతున్న డాక్టర్ వెంకటేశ్వర్లు

జూలూరుపాడు: అనంతారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం హెల్త్ క్యాంప్ నిర్వహించారు. నెల రోజుల వ్యవధిలో గ్రామానికి చెందిన ఎనిమిదేళ్ల చిన్నారి, మహిళ కిడ్నీ వ్యాధితో మృతి చెందడంతోపాటు, పలువురు కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. ఈ మేరకు తహసీల్దార్ కె.స్వాతిబిందు, ఎంపీడీఓ డి.కరుణాకర్‌రెడ్డి పర్యవేక్షణలో జూలూరుపాడు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ బి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. 50 మందికి పైగా కిడ్నీ బాధితులు, అనుమానితుల రక్తనమూనాలను సేకరించారు. అంతకముందు డాక్టర్ వెంకటేశ్వర్లు కిడ్నీ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎంపీఓ తులసీరామ్, ఆర్ఐ తిరుపతిరావు, జీపీ సెక్రటరీ శైలజ, పీహెచ్‌సీ సీహెచ్ఓ రామకృష్ణ, హెచ్ఎస్ రత్నకుమార్, ఎల్‌టీ జగదీష్, హెచ్ఏ కృష్ణ, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

డిప్యూటీ డీఎంహెచ్ఓ సందర్శన

మండలంలోని అనంతారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో జూలూరుపాడు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంప్‌ను కొత్తగూడెం డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సుకృత ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కిడ్నీ బాధితులతో ఆమె మాట్లాడారు. మెరుగైన వైద్యం, డయాలసిస్ సేవలు అందించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కిడ్నీ వ్యాధి బారిన ఎందుకు పడుతున్నారని, దీనికి గల కారణాలను తెలుసుకొని నియంత్రణ చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు.

బీఆర్ఎస్ నాయకుల నిరసన

ఇల్లెందు: ఇది లూటీల, లూటీల రాజ్యమని అన్నం పెట్టే రైతన్నలకు బేడీలు వేసిన చరిత్ర కాంగ్రెస్‌దేనని మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియ ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం ఇల్లెందులో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. లగచర్ల రైతులను వెంటనే విడుదల చేయాలని, వారిపై మోపిన అక్రమ కేసులు ఎత్తివేయాలని కోరారు. ఇల్లెందు కొత్త బస్టాండ్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దిండిగల రాజేందర్, సిలివేరు సత్యనారాయణ, లకావత్ దేవీలాల్ నాయక్, ఎస్.రంగనాథ్, ఎర్రబెల్లి కృష్ణయ్య, అజ్మీరా బావుసింగ్, శీలం రమేష్, జేకే శ్రీనివాస్, కటకం పద్మావతి, వీణ, లలిత శారద, మాధవి, పద్మ, సుజాత, నెమలి ధనమ్మ, సరిత, నారాయణమ్మ, రేణుక, మంగమ్మ, ప్రమోద్, పోషం, నాగరాజు, అబ్దుల్ నబీ, జబ్బార్, రాజేష్, ఆదూరి రవి, కాసాని హరిప్రసాద్ యాదవ్, మునిగంటి శివ తదితరులు పాల్గొన్నారు.


అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సీపీఎం జిల్లా మహాసభలకు ఏర్పాట్లు పూర్తి

ఇల్లెందు: బొగ్గుట్టగా పేరున్న ఇల్లెందుకు చరిత్ర ఉందని, ఇక్కడ తొలిసారి సీపీఎం జిల్లా మహాసభల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పి.సోమయ్య, జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య తెలిపారు. మంగళవారం ఇల్లెందులోని పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ... సుమారు 50 ఏళ్ల పాటు కమ్యూనిస్టు నేతలు ఇక్కడి నుంచి ఎమ్మెల్యేలుగా ప్రాతినిధ్యం వహించారని చెప్పారు. ఈ నేపథ్యాన ఈనెల 20, 21వ తేదీల్లో నిర్వహించే జిల్లా మహాసభల్లో జిల్లాతో పాటు ఇల్లెందు సమస్యలపై చర్చించి భవిష్యత్ పోరాటాలకు కార్యాచరణ రూపొందించనున్నామని తెలిపారు. ఈ సమావేశంలో మచ్చా వెంకటేశ్వర్లు, ఏజే.రమేష్, కె.శ్రీధర్, రేపాకుల శ్రీనివాస్, ఆలేటి కిరణ్‌కుమార్, కృష్ణ, మోహన్‌రావు, బోసు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులను ఖండించండి..



ఇల్లెందు: ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): గ్రామపంచాయితీ కార్మికుల సమస్యలపై చలో అసెంబ్లీ ధర్నాకు పర్మిషన్ ఇచ్చినట్లే ఇచ్చి, కార్మిక సంఘాల నాయకులను అదుపులోకి తీసుకోవటం సిగ్గుచేటని, అక్రమ అరెస్టులను టీయూసీఐ నాయకులు ఖండిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా కోశాధికారి పెద్దబోయిన సతీష్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక జిల్లా కార్యాలయంలో మాట్లాడుతూ.. రాష్ట్రంలో గ్రామపంచాయతీ కార్మికులు సుమారు 60 వేల మంది న్యాయమైన డిమాండ్ల సాధనకు ఆందోళన చేస్తున్న క్రమంలో ప్రభుత్వం వారి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంలో తమ గొంతు వినిపించడానికి కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఈరోజు చేపట్టిన ధర్నా పోలీసుల అనుమతి ఉందన్నారు. కానీ రాత్రికి రాత్రే కార్మికులను కార్మిక సంఘాల నాయకులను అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు.

ఇల్లెందు: పంచాయతీ కార్మికులకు వేతనాలు ఇవ్వకపోగా తమ గోడు వెళ్లబోసుకోవడానికి చలో హైదరాబాద్ తరలి వెళ్లిన కార్మికులను అక్రమంగా అరెస్టు చేసిన వారిని బేషరుతుగా విడుదల చేయాలని టీయూసీఐ జిల్లా కార్యదర్శి యాకుబ్‌షావలీ డిమాండ్ చేశారు. మంగళవారం ఇల్లెందులో టీయూసీఐ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి పాత బస్టాండ్ సెంటర్‌లో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. అరెస్టు చేసిన కార్మికులను బేషరుతుగా విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బుర్ర వెంకన్న, మల్లెల వెంకటేశ్వర్లు, శేషయ్య, శైలేంద్ర, నరేష్, వెంకన్న, చంద్రమౌళి, పాండు, బాలు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారులకు సన్మానం

కొత్తగూడెంఅర్బన్: 1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమకారుల సమితి తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ అధ్యక్షుడు డాక్టర్ చీమల శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ప్రధాన కార్యదర్శి కేజీఎస్ మాథ్యూస్ ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారులను మంగళవారం కొత్తగూడెం చిల్డ్రన్స్ పార్క్‌లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాథ్యూస్ మాట్లాడుతూ.. 1969 నుంచి ప్రత్యక్షంగా ఉద్యమంలో ఉన్నానని, పోరాటాల ఫలితమే తెలంగాణ సాధించామని తెలిపారు. తొలి దశ, మలిదశ ఉద్యమకారులను గత ప్రభుత్వం పట్టించుకోలేదని, ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. ఉద్యమకారులకు 250 గజాల ఇంటిస్థలం, రూ.25 వేల పెన్షన్, రైలు, బస్సు సర్వీస్‌లలో 50 శాతం రాయితీని ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈనెల 21న హైదరాబాద్ సుందరయ్య భవన్‌లో సభ నిర్వహిస్తున్నామని, ఉద్యమకారులందరూ అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో కామేశ్వరరావు, బ్రహ్మయ్య, శైలేందర్, కొమరయ్య, పి.రామచందర్, జి.లక్ష్మీనారాయణ, ఏ.రాజయ్య, అప్పల రామస్వామి, రఘు రాములు, సర్వోత్తమరావు తదితర ఉద్యమకారులు పాల్గొన్నారు.


ఉద్యమకారులను సన్మానిస్తున్న దృశ్యం